క్లుప్తంగా

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



చౌడేశ్వరీదేవికి పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: కార్తీక మాసం మంగళవారం సందర్భంగా పట్టణ సమీపంలోని చౌడేశ్వరీదేవి, సిమెంట్‌నగర్‌లోని సుంకులా పరమేశ్వరి, వెంకటగిరి గ్రామంలోని ఎల్లమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు గ్రామ దేవతలకు పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ఒడి బియ్యం, మహా మంగళహారతి ఇచ్చి పూజలు చేశారు.

మారెమ్మ ఆలయానికి వరండా ఏర్పాటు



ఆలయ ముందుభాగంలో ఏర్పాటు చేసిన వరండా

కోవెలకుంట్ల: పట్టణంలోని అంకాలమ్మ చౌరస్తాలో వెలసిన మారెమ్మ ఆలయానికి దాత సహకారంతో మంగళవారం వరండా ఏర్పాటు చేశారు. వర్షాకాలం, వేసవికాలంలో ఆలయానికి వచ్చే భక్తులకు నీడ వసతి కల్పించేందుకు వీలుగా స్థానిక ఎల్‌ఎం కాంపౌండ్‌కు చెందిన మాలె పెద్ద రంగడు రూ. 65 వేల విరాళం అందజేశారు. దాత అందజేసిన విరాళంతో ఆలయ ముందు భాగంలో రేకులతో వరండా ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు ఉసేనప్ప, మైకేల్, శిలువయ్య తెలిపారు.

మోతాదుకు మించి మందులను వాడొద్దు



బుగ్గానిపల్లెలో కంది పంటను పరిశీలిస్తున్న ఏఓ

బేతంచెర్ల: వివిధ పంటల్లో చీడపీడల నివారణకు మోతాదుకు మించి పురుగు మందులను వాడొద్దని ఏఓ కిరణ్ కుమార్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని హెచ్ కొట్టాల, బుగ్గానిపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పొగాకు, మిరప, కంది పంటలను పరిశీలించారు. కందిలో ప్రస్తుతం గూడు పురుగు ఆశించిందని, రైతులు ఎమ్మామెక్టిన్ బెంజోయేట్, నోవాలరన్ మందుతో పాటు వేప నూనె కలుపుకుని పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి అజయ్, అగ్రికల్చర్ అసిస్టెంట్ శివ, నాగేంద్ర, రవితేజ పాల్గొన్నారు.

రైతు సంఘం మండల కమిటీ ఎన్నిక



రైతు సంఘం నూతన కమిటీ

సంజామల: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న ఆధ్వర్యంలో ఎన్నికల జరిగింది. సంజామల మండల కన్వీనర్‌గా బి.అబ్రహం, సహాయ కన్వీనర్‌గా గోపాల కృష్ణ ప్రసాద్, కమిటీ సభ్యులుగా రాజేష్, దొరబాబు, శేఖర్, బాషా, నాగరాజు, రాజుకుమార్, మద్దిలేటి, హుస్సేన్ బాషాను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి జయంతోత్సవం



బనగానపల్లెలోని వీరబ్రహ్మేంద్రస్వామి

బనగానపల్లె రూరల్: పట్టణంలోని నంద్యాల రోడ్డులో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం వీరబ్రహ్మేంద్రస్వామి 416వ జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస ఆచారి మంగళవారం తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాత వేదస్వస్తి పారాయణం, ద్వార పూజ, స్వామి వారికి మహన్యాసన పూర్వక రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, షోడషోత్తర చతుశ్శత జన్మదిన పూజ, కాళికాంబాదేవి కుంకుమార్చన, గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి వారి కల్యాణోత్సవం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పల్లకీ సేవ తదితర కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వీరబ్రహ్మేంద్రస్వామి ఆశీస్సులు పొందాలని అర్చకులు తెలిపారు.

కోతల సమయం.. జాగ్రత్తలు అవసరం

- వరికోత యంత్రాలతో ఖర్చు, సమయం ఆదా
- యంత్రాల వైపే మొగ్గు చూపుతున్న రైతులు
- జాగ్రత్తలు అవసరమంటున్న వ్యవసాయ అధికారులు
- మరో వారంలో ప్రారంభం కానున్న వరి కోతలు



కోత దశలో ఉన్న వరి పంట



కోతల కోసం సిద్ధంగా ఉంచిన హార్వెస్టర్ యంత్రాలు

అవుకు: కూలీల సమస్య, సమయం, ఖర్చు ఆదా చేసుకోవడానికి చాలా మంది రైతులు వరియంత్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే కోతల సమయంలో పలు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. లేకుంటే నష్టపోయే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. మరో పది రోజుల్లో కోతలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పలు సూచనలు చేశారు.

నియోజకవర్గంలో 28 వేల ఎకరాల్లో వరిసాగు

ఈ ఏడాది బనగానపల్లె నియోజకవర్గంలో దాదాపు 28,652 ఎకరాల్లో వరిపంటను సాగు చేసారు. అత్యధికంగా అవుకు మండలంలో 11,814 ఎకరాలు, అత్యల్పంగా కొలిమిగుండ్ల మండలంలో 810ఎకరాల్లో సాగైంది. బోర్లు, బావుల ద్వారా నీరు ఉన్నవారు జూన్‌లో నారుమడులు వేసి, జూలై నెలలో నాట్లు వేశారు. అలాగే కాలువల ద్వారా పంటలకు నీరు అందే రైతులు సెప్టెంబర్ నెలలో వరినాట్లు వేశారు. దీంతో వరికోతలు దాదాపు రెండు నెలలు జరిగే అవకాశం ఉంది. మరో పది రోజుల్లో వరి కోతలు ప్రారంభం కానుంది. కోతల సమయంలో కూలీల కొరత, అధిక ఖర్చు, సమయం వృథా అవుతుండడంతో రైతులంతా హార్వెస్టర్ యంత్రాలవైపే మొగ్గు చూపుతున్నారు. దీంతో రైతులకు ఖర్చుతో పాటు సమయం ఆదా అవుతుంది. హార్వెస్టర్ యంత్రం ద్వారా కోత కోసిన గింజలను నేరుగా మార్కెట్‌లకు తరలించుకునే అవకాశం ఉంది. ఇప్పటికే ఆయా మండలాల్లో వరికోత యంత్రాలను సిద్ధంగా ఉంచారు. అయితే హార్వెస్టర్ యంత్రాలు వినియోగించే సమయంలో రైతులు, యజమానులు ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా నష్టపోవాల్సి వస్తుందని, అందుకే యంత్రాలతో వరికోతల సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు

- ఒక మడి నుంచి మరొ మడికి వెళ్లేందుకు ముందుగా మంచి బాట తీస్తే హార్వెస్టర్ యంత్రం సులువుగా వెళ్తుంది. దీంతో సమయం ఆదాతో పాటు వడ్లు పాడయ్యే అవకాశం ఉండదు.
- పూర్తిగా భూమి ఎండిన తర్వాత వరి కోస్తే సమయం ఆదా అవుతుంది.
- ఒడ్డు, గట్టు చుట్టూ ఉన్న వరిపంటను చేతితో కోయటం వల్ల ఎకరాకు దాదాపు పది నిమిషాల సమయం కలిసి వస్తుంది.
- పచ్చిగా ఉన్న వరి కోయడం వల్ల సమయం ఎక్కువగా పడుతుంది. అదే విధంగా వడ్లు కూడా మట్టిలో కలిసిపోయే అవకాశం ఉంటుంది.
- పొలంలో రాళ్లు ఉండే చోటును ముందుగానే గుర్తిస్తే కోత సమయంలో మిషన బ్లేడ్ విరిగి నష్టం వాటిల్లకుండా ఉంటుంది.
- తప్పనిసరిగా హార్వెస్టర్‌కు డ్రైవర్‌తో పాటు అతనికి తోడుగా మరొకరిని సహాయకుడిగా పంపించాలి.
- విద్యుత్ స్తంభాలకు చాలా దూరం నుంచే హార్వస్టర్‌ను వెళ్లనివ్వాలి.
- వరిపంట నేలకు ఆనుకున్న సమయంలో హార్వెస్టర్‌తో కాకుండా కూలీల చేత కోత కోయించాలి.
- వడ్లు నిల్వ ఉంచుకునే రైతులు హార్వెస్టర్‌తో పంటను కోసిన వెంటనే తేమ లేని ప్రదేశంలో వడ్లు ఆరబోసి పూర్తిగా ఒట్టిబడిన తర్వాత నిల్వ చేసుకోవాలి.
- వాతావరణంలో మార్పులు ఉన్న సమయంలో కోతలు కోయకుండా ఉండటమే మంచిది. నేల, వరి గింజల్లో తేమలేదు అనుకున్న సమయంలో మాత్రమే మిషన్ ద్వారా కోత కోయించాలి.
- గింజలో తేమ ఉన్న సమయంలో మిషన్ ద్వారా కోత నిర్వహించినా, వర్షం వచ్చే సూచనలు ఉన్నప్పుడు కోతలు నిర్వహించినా గింజల్లో తేమశాతం ఉండి, వరి గింజలు బూజుపట్టి పాడైపోతాయి.

బనగానపల్లె నియోజకవర్గంలో వరి సాగు ఇలా

మండలం	ఎకరాలు
అవుకు	11814
బనగానపల్లె	8895
కోవెలకుంట్ల	3704
సంజామల	3429
కొలిమిగుండ్ల	810

దిగుబడులపై ప్రభావం



ఈ ఏడాది అవుకు మండలంలో వరిపంట సాగు ఎక్కువగా జరిగింది. ప్రతి గింజలోనూ దిగుబడి ఆధారపడి ఉంటుంది. కావున ప్రతి రైతు పంట కోతల సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. పంట దిగుబడిని కాపాడుకోవాలి.– **అబ్దుల్ హక్, వ్యవసాయ అధికారి, అవుకు**

ఉద్యాన పంటలతో అధిక లాభాలు



రైతులతో మాట్లాడుతున్న జిల్లా అధికారులు

డోన్ రూరల్: ఉద్యాన పంటలైన మామిడి, చీని, ఉల్లి, కూరగాయల పంటలతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు, జిల్లా పట్టు పరిశ్రమశాఖ అధికారిని జి.పరమేశ్వరి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గోసానిపల్లి, చింతలపేట గ్రామాల్లో వ్యవసాయ అధికారి అబ్దుల్‌షఫీ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంటలను పరిశీలించి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఆయిల్‌పాం పంటలను నీళ్లు పుష్కలంగా ఉన్న రైతులు సాగు చేసుకోవచ్చని సూచించారు. రైతులు రబీ సీజన్‌లో పప్పుశనగ, జొన్నలు, వేరుశనగ, ఉల్లి పంటలకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద సాగుచేసుకోవచ్చని పేర్కొన్నారు. దీనికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు పంట బీమా వర్తిస్తుందని తెలిపారు. ఉద్యానశాఖ అధికారి కళ్యాణి, పట్టుపరిశ్రమ మండల అధికారి ప్రసాద్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికే ఉల్లాస్



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

బనగానపల్లె రూరల్: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ కార్యక్రమ ఉద్దేశం అని ఎంపీడీఓ వెంకటరమణ అన్నారు. మంగళవారం స్థానిక పొదుపు భవనంలో ఉల్లాస్‌పై వలంటీర్లకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. పొదుపు సంఘాల్లో ఉన్న నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా మార్చాలన్నారు. మండలంలో సుమారు 3,800 మంది నిరక్షరాస్యులను గుర్తించామని తెలిపారు. వీరిని అక్షరాస్యులుగా మార్చేందుకు 270 మంది వలంటీర్లను ఏర్పాటు చేశామన్నారు. వచ్చే ఏడాది మార్చి వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని.. వయోజన కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీఆర్‌డీఏ ఏపీఎం శ్రీనివాసులు, ఎంఈఓ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో దివ్యాంగులకు అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న అందనం దేవరాజు

కోవెలకుంట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024–25 వార్షిక బడ్జెట్‌లో దివ్యాంగులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆ సంఘం జిల్లా జేఏసీ అధ్యక్షుడు అందనం దేవరాజు అన్నారు. మంగళవారం కోవెలకుంట్లలోని స్మారక కొండారెడ్డి గ్రంథాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. దివ్యాంగులను కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భావించామన్నారు. వార్షిక బడ్జెట్‌లో దివ్యాంగులకు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం విచారకరమన్నారు. దివ్యాంగుల సంక్షేమాన్ని విస్మరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బడ్జెట్‌లో జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఈ నెల 15వ తేదీ కోవెలకుంట్లలో తలపెట్టిన ధర్నాకు దివ్యాంగులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. త్వరలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలిసి సమస్యలను వివరిస్తామన్నారు. సంఘం నాయకులు నారాయణ రెడ్డి, ఆలీ, రమణ, సుబ్బరాయుడు, ఓబులేసు పాల్గొన్నారు.

సారా తయారీ చేస్తే కఠిన చర్యలు



పట్టుబడిన సారాను చూపిస్తున్న సీఐ వరలక్ష్మి

డోన్ రూరల్: నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో సారా విక్రేతల అరెస్టు చూపించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో దాడులు చేశామన్నారు. డోన్ కొత్తకోట కాలనీలో సారా విక్రయిస్తున్న ఎరుకలి స్కులమ్మను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుంచి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే ప్యాపిలి మండలంలోని శ్రీరామ టాకీస్ సమీపంలో పుల్లాసి సుంకులమ్మను అరెస్టు చేసి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎస్‌ఐలు సోమశేఖర్‌రావు, దౌలత్‌ఖాన్, కానిస్టేబుళ్లు మారుతి ప్రసాద్, లక్ష్మీనారాయణ, సుధాకర్‌రెడ్డి, ఉమాకాంత్‌రెడ్డి, రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.



పూతకు వచ్చిన కంది పంట

రైతుల్లో తుపాన్ గుబులు

కొలిమిగుండ్ల: బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాన్ ప్రభావంతో మంగళవారం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. వాతావరణం చల్లబడి మేఘాలు ఆవరించాయి. ఖరీఫ్‌లో కొలిమిగుండ్ల మండలంలో 600 హెక్టార్లలో కంది పంటను రైతులు సాగు చేశారు. అన్ని పంటల కంటే కంది ఈసారి అత్యధికంగా సాగులో ఉంది. 20 శాతానికి పైగానే పంట పూత దశకు వచ్చింది. ఈ సమయంలో తుపాన్ ప్రభావం ఉండడంతో రైతులు కలవరపడుతున్నారు. తేలిక పాటి జల్లులు కురవడంతో మరింత ఆందోళన చెందుతున్నారు. పూత సమయంలో వర్షం కురిస్తే పూత రాలిపోయి పంట దిగుబడి తగ్గిపోతుందని రైతులు దిగాలు చెందుతున్నారు. వరి కోతలకు ఇంకా సమయం ఉండడంతో ఎలాంటి ఇబ్బంది లేదు. రబీలో సాగు చేసిన శనగ పంటకు తుపాన్ ప్రభావంతో వర్షం కురిసినా పంటకు మేలని రైతులు పేర్కొన్నారు. కానీ కంది సాగు చేసిన రైతులు మాత్రం టెన్షన్‌గా ఉన్నారు.

నేడు సర్పంచ్‌లకు అవగాహన కార్యక్రమం

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ పంచాయతీల సుస్థిరాభివృద్ధిపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వీఓఏలకు ఒక్క రోజు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని కోరారు.

కార్తీక పౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు

కొలిమిగుండ్ల: స్థానిక లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 15న కార్తీక పౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ పురోహితులు ఆలూరి నరసింహప్రసాద్ మంగళవారం తెలిపారు. లలితా సుందరేశ్వరస్వామిని పూలతో విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం మేళతాళాలతో స్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో గ్రామోత్సవం చేస్తామన్నారు. అనంతరం ఊంజల్ సేవ, జ్వాలాతోరణం ఉంటుందన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

బకాయిలు చెల్లించాలి

కోవెలకుంట్ల: కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఐదు నెలలు గడిచినా ఇప్పటి వరకు ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించలేదని జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం షరీఫ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు పీఎఫ్, ఏపీజీఎల్ఐ పొదుపు నిమిత్తం కోట్లాది రూపాయలు నెలసరి చందాలు, వేతనాల నుంచి చెల్లించారన్నారు. వైద్య ఖర్చులు, పిల్లల వివాహ ఖర్చుల కోసం పొదుపు చేసిన సొమ్ము ఉపయోగపడుతుందని భావించామన్నారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రేపు అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

కోవెలకుంట్ల: పట్టణంలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఈ నెల 14వ తేదీ గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ వరప్రసాదరావు తెలిపారు. మండలంలోని గ్రామ పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు చేపట్టాల్సిన ప్రణాళికలు, బ్లాక్ పంచాయతీ అభివృద్ధి, తదితర అంశాలపై ఒక్కరోజు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఓలు, వెలుగు ఏపీఎం, ఉపాధి ఏపీఓ, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల డాక్టర్లు, వెటర్నరీ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామైక్య సంఘ అధ్యక్షురాలు, గ్రామ సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు శిక్షణకు హాజరు కావాలని పేర్కొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

కోవెలకుంట్ల: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం సీజ్ చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు నుంచి కోవెలకుంట్ల మీదుగా ఇసుకను ట్రాక్టర్లలో తీసుకెళుతుండగా అందిన సమాచారం మేరకు దాడి చేశామన్నారు. ఇసుక తరలింపునకు ఎలాంటి రికార్డులు లేకపోవడంతో కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

హామీలను అమలు చేయాలి

బనగానపల్లె రూరల్: కూటమి పార్టీలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు బాలకృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కరపత్రాలను ఆవిష్కరించారు. ఏఐటీయూసీ నాయకులు కుళ్లాయిస్వామి, సీపీఐ నాయకులు సంజీవులు, మున్ని, అనూష తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి



రెవెన్యూ అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్డీఓ నరసింహులు

- డోన్ ఆర్డీఓ నరసింహులు

అవుకు: ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని డోన్ ఆర్డీఓ కేపీ నరసింహులు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం అవుకు రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. రైతులు, భూయజమానుల నుంచి వచ్చే వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. భూ రికార్డులను జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. ఆర్‌ఓఆర్‌లలో అవకతవకలు లేకుండా సరిచూసుకోవాలని తెలిపారు. అనంతరం అవుకు మండలంలోని సాగునీటి సంఘాలపై ఆరా తీశారు. తిమ్మరాజు, పాలేరు చెరువులతో కలిపి 8 మేజర్ చెరువులు, 5 మైనర్ చెరువులు ఉన్నాయని, మైనర్ ట్యాంకుల్లో కోటవాని చెరువు, హయ్యత్‌ఖాన్, బాలికుంట, వేములపాడు, దీక్షితుల చెరువులు ఉన్నట్లు తహసీల్దార్ సువర్ణాదేవి ఆర్డీఓకు వివరించారు. ఆయా చెరువుల కింద సాగు జరిగే సర్వేనంబర్లలోని భూయజమానుల జాబితా ద్వారా మండలంలో 11869 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఇందులో 9103 మంది పురుష ఓటర్లు, 2766 మంది మహిళా ఓటర్లు ఉన్నాయని పేర్కొన్నారు. త్వరలోనే సాగునీటి సంఘాల ఎన్నికలు జరుగుతాయని.. సిద్ధంగా ఉండాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున రెడ్డి, మండల సర్వేయర్ హరి, ఆర్‌ఐ వెంగల్ రెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



బనగానపల్లె ఉద్యోగుల సంఘం నూతన కమిటీ

బనగానపల్లె: బనగానపల్లె నియోజకవర్గ ఉద్యోగుల సంఘం నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఈ కార్యక్రమం జరిగింది. అధ్యక్షుడిగా బిచ్చయ్య, కార్యదర్శిగా చంద్రశేఖర్, సహ అధ్యక్షుడిగా డాక్టర్ సుజాత, కోశాధికారిగా నవీన్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులుగా జయరామ్ నాయక్, ముక్తియార్, షర్మిల, హరినాథ్, సురేష్‌బాబు, అబ్దుల్‌ఖలీం, సంయుక్త కార్యదర్శులుగా నాగసురేంద్రబాబు, కమలహాసన్, చరణ్, ఈశ్వర్ ప్రసాద్, అబ్దుల్‌రహీంను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్ప, ఉపాధ్యక్షుడుగా పక్రుద్దీన్ వ్యవహరించారు.

108లో ప్రసవం

సంజామల: మండల పరిధిలోని ఎగ్గొని గ్రామానికి చెందిన లక్ష్మీదేవి 108 అంబులెన్స్‌లో మగ బిడ్డను జన్మనిచ్చింది. మంగళవారం తెల్లవారుజామున పురిటి నొప్పులు రావడంతో 108కు సమాచారం ఇచ్చారు. కోవెలకుంట్ల ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా నొప్పులు అధికమయ్యాయి. దీంతో ఈఎన్‌టీ నాగరాజు, పైలెట్ పుల్లన్న డెలివరీ చేశారు. అనంతరం తల్లీబిడ్డను కోవెలకుంట్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లక్ష్మీదేవి కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



శిశువును చూపున్న ఈఎన్‌టీ